


చీనీ టన్ను రూ.16,500

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16,500, కనిష్టం రూ.7 వేలు చొప్పున పలికాయి.



టమాటా కిలో రూ.15

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.15, కనిష్టం రూ.9, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.9°/22.1°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

గురుకుల విద్యార్థి అదృశ్యం

ఉరవకొండ: గురుకుల విద్యార్థి ఒకరు అదృశ్యమయ్యారు. గుత్తి మండలం బసనేపల్లి తండాకు చెందిన రామాంజినేయులు కుమారుడు మహేష్‌నాయక్ రాగులపాడు గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 4వ తేదీ రాత్రి భోజనం అనంతరం నుంచి మహేష్‌నాయక్ కన్పించలేదు. ఈ విషయాన్ని తోటి విద్యార్థులు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌కు తెలిపారు. దీంతో వెంటనే వారి తల్లిదండ్రులకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు ఈ మేరకు కుమారుడు కనిపించడం లేదని శుక్రవారం వజ్రకరూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆయతపల్లిలో విషాదం

- నీటి కుంటలో దిగి 4వ తరగతి విద్యార్థి మృతి
- సరదాగా స్నేహితులతో కలిసి గణపతిని నిమజ్జనం చేస్తుండగా ఘటన



మనోజ్ మృతదేహం

రాయదుర్గం టౌన్: మండలంలోని ఆయతపల్లిలో విషాదం చోటు చేసుకుంది. గణపతి నిమజ్జనం కోసం నీటి కుంటలో దిగిన ఓ బాలుడు బురదలో కూరుకుపోయి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం కొత్తపల్లి గ్రామానికి మల్లయ్య, జయమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు మనోజ్ (9) చిన్నప్పటి నుంచి రాయదుర్గం మండలం ఆయతపల్లిలోని అవ్వాతాతల వద్ద ఉంటూ అక్కడే చదువుకుంటున్నాడు. ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న మనోజ్ శుక్రవారం మరో ఇద్దరు స్నేహితులతో కలసి మట్టితో ఓ చిన్నగణపతిని చేశాడు. అనంతరం వారికి తోచిన విధంగా పూజలు చేసి సరదాగా ఆడుకుంటూ పాఠశాల వెనుక ఉన్న కుంటలో నిమజ్జనం చేసేందుకు వెళ్లారు. గణపతి బొమ్మను తీసుకుని కుంటలోకి దిగిన మనోజ్ బురదలో కూరుకు పోతుండగా.. గమనించిన తోటి స్నేహితులు పరుగున గ్రామంలోకి వెళ్లి బంధువులకు సమాచారం అందించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని బాలుడిని వెలికి తీసి రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా... అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు మధ్యాహ్నం పంపనూరు ఆలయం మూసివేత



ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రంలో ఆదివారం మధ్యాహ్నం వరకే పూజాదికాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ బాబు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం 1 గంట నుంచి ఆలయం తలుపులు మూసి, తిరిగి సోమవారం తెల్లవారుజామున సంప్రోక్షణ కార్యక్రమాలతో తెరుస్తారని పేర్కొన్నారు.

తిరుఓనం.. భక్తజన సంద్రం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న కేరళ భక్తులు

ప్రశాంతి నిలయం: ఆధ్యాత్మిక ధామం ప్రశాంతి నిలయంలో కేరళ సంస్కృతి ఉట్టిపడింది. రెండు రోజులుగా సాగుతున్న ఓనం వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు వేలాది మంది కేరళీయులు వేడుకల్లో పాల్గొన్నారు. తమ సంస్కృతి సంప్రదాయాలు చాటుతూ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిగీతాలు ఆలపిస్తూ వేడుకలు నిర్వహించుకున్నారు. సాయంత్రం కేరళకు చెందిన సత్యసాయి యూత్, బాలవికాస్ చిన్నారులు 'పరిత్రానాయ భక్తానాం' పేరుతో సంగీత నృత్యరూపకం నిర్వహించారు. కవయిత్రి జనాబాయి జీవిత చరిత్ర గురించి చక్కగా వివరించారు. అనంతరం వారంతా సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



నృత్య ప్రదర్శన

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబి



అనంతపురంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ప్రేమ, సహనం, శాంతి, సామరస్యాలను బోధించిన మహమ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్ – ఉన్– నబిని శుక్రవారం జిల్లా అంతటా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పెద్ద ఎత్తున శాంతి ర్యాలీలు నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మిలాద్ ఉన్ నబి ప్రాముఖ్యత గురించి మతపెద్దలు వివరించారు. అనంతరం ముస్లింలు ప్రవక్త పవిత్ర కేశాన్ని వీక్షించారు. – అనంతపురం కల్చరల్



మసీదు నమూనాలతో ప్రదర్శనగా వెళ్తున్న దృశ్యం

రికవరీలో తరుగుతోంది!

ఇటీవల గుంతకల్లులో గుర్తు తెలియని వ్యక్తులు ఓ మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లారు. రమారమి 3 తులాలకు పైగా ఆ గొలుసు ఉంటుంది. బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్‌లో ఒకటిన్నర తులం అని చెప్పి చివరకుఆ మేరకే రికవరీ చేశారు.

అనంతపురం నగరంలో ఓ మహిళకు చెందిన ఐదు తులాల బంగారం దొంగిలించారు. దీనిపై బాధిత మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చాలా రోజులు స్టేషన్ చుట్టూ తిరిగిన తర్వాత పోలీసులు ఘటనపై కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో కేవలం రెండు తులాలే పోయినట్లు నమోదు చేశారు. మూడు మాసాల తర్వాత రెండు తులాల బంగారమే ఇచ్చారు.

కంబదూరుకు చెందిన పేరుమోసిన చైన్ స్నాచర్ మారుతి పోలీసులందరికీ తెలుసు. అతనిపై సుమారు 70 కేసులున్నాయి. అయినా సరే పోలీసుస్టేషన్‌కు వెళ్లడం, బయటకు రావడం అతనికి పరిపాటిగా మారింది. మారుతి నుంచి భారీ ఎత్తున బంగారు రికవరీ చేయాల్సి ఉంది.



- బంగారం రికవరీలో భారీ కోతలు
- నగం వచ్చినా చాలన్నట్లుగా బాధితులు
- పోలీసుల వాహన, ఇంధన ఖర్చులన్నీ తరుగు కిందే లెక్క
- మరో మార్గం లేదంటున్న పోలీసు వర్గాలు
- 90 శాతం బంగారు చోరీ కేసుల్లో రికవరీనే లేదు



ఆగస్టు 28న రికవరీ చేసిన బంగారు నగలను మీడియాకు చూపుతున్న ఎస్పీ జగదీష్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: బంగారం ధర ఆకాశాన్నంటుతోంది. ఇప్పట్లో ధరలు దిగివచ్చే అవకాశాలు కనిపించడం లేదు. ఈ క్రమంలోనే చైన్ స్నాచింగ్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. రోజుకు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో 30 నుంచి 40 చైన్ స్నాచింగ్ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. రెండు నెలల క్రితం హిందూపురంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఏకంగా 12 కేజీల బంగారం చోరీకి గురవడం గమనార్హం. రాయదుర్గంలో నలుగురు మహిళా దొంగలను పోలీసులు పట్టుకున్నారు. ఈ క్రమంలో బస్సుల్లో వెళ్లాలన్నా మహిళలు భయపడిపోతున్నారు. పార్కుల్లో వాకింగ్, మార్కెట్లలో కూరగాయలు తెచ్చుకునేందుకు బంగారు గొలుసులు వేసుకుని వెళ్తే అంతే సంగతులు అన్నట్లుగా పరిస్థితి తయారైంది.

రిక'వర్రీ'..

బంగారం దొంగతనాల కేసులో రికవరీ అత్యంత ఘోరంగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారింది. హిందూపురం బ్యాంకులో 11 కేజీల బంగారం పోతే ఇప్పటికి 2 కేజీలే రికవరీ అయింది. 90 శాతం కేసుల్లో అసలు రికవరీనే ఉండడం లేదు. ఈ క్రమంలో బంగారం చోరీకి గురైనా తిరిగి రికవరీ అవుతుందా అన్న విషయం ఆందోళన కలిగిస్తోంది.

భారీగా కోత..

బంగారం చోరీకి గురై కేసు నమోదైతే సగం కంటే ఎక్కువ తరుగు కింద లెక్క కడుతున్నారు. బంగారం రికవరీకి వాహనాల్లో వెళ్లాల్సి ఉంటుంది. డీజిల్‌కు, భోజనాలకు ఖర్చు అవుతుంది. అందుకే దొరికిన బంగారులో భారీగా కోత వేస్తున్నారు. సగానికి సగం పోలీసుల చేతిలోనే కోతకు గురవుతోంది. ఇంతకంటే తమకు మార్గం లేదని సీసీఎస్ పోలీసులు అంటున్నారు. బాధితులు కూడా వచ్చిందే చాలన్నట్టు తీసుకుని వెళుతున్నారు. రెండు జిల్లాల్లోనూ పోలీసులు తరుగులు లేకుండా బంగారం రికవరీ చేసే పరిస్థితి లేదు.

గుత్తి-అనంతపురం రూటు డేంజర్

జిల్లాలోనే ఎక్కువగా గుత్తి నుంచి అనంతపురం రూటు బస్సుల్లో బంగారు చోరీలు జరుగుతున్నాయి. సుమారు 10 నుంచి 15 దొంగల బ్యాచ్‌లు ఈ రూటులో ఉన్నట్లు తెలిసింది. బ్యాగులో బంగారం పెట్టుకుని వెళ్లారా అంతే అన్నట్లుగా పరిస్థితి తయారైంది. ఈ మార్గంలో రోజూ ఒక మహిళ మెడలో గొలుసైనా చోరీ జరుగుతోంది. ఈ రూటులో ప్రయాణించే మహిళా ప్రయాణికులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని పోలీసులే చెబుతున్నారు.

యూరియాను అక్రమంగా తరలిస్తే చర్యలు



నాయనపల్లిక్రాస్‌లో ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

శింగనమల: జిల్లాలో యూరియాను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం శింగనమల మండలం నాయనపల్లి క్రాస్‌లోని శ్రీలక్ష్మీ నరసింహ ఆగ్రో ఏజెన్సీ ఎరువుల దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం అక్కడి వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

- పి.జలాలపురంలోని రైతు సుబ్బరాయుడు సాగు చేసిన చీనీ తోటను కలెక్టర్ పరిశీలించారు. ఉద్యాన శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్ర స్థాయిలో పంటల సాగుపై సలహాలు, సూచనలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, తహసీల్దార్ శేషారెడ్డి, ఉద్యాన అధికారి శైలజా, ఏఓ అన్వేష్‌కుమార్, ఏఎస్ఐ చితంబరయ్య పాల్గొన్నారు.

ఆందోళన చెందవద్దు

యూరియా కొరత లేదని, రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం తరిమెల గ్రామంలోని భైరవ, నిత్య ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన ఎరువులు మాత్రమే విక్రయించాలని, అనవసరమైన ఎరువులు జోడించి అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుత్తి ఏడీఏ వెంకటరాముడు, మండల వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గురువుల పాత్ర కీలకం

అనంతపురం ఎడ్యుకేషన్: డాక్టర్ కావడానికి గురువు...ఇంజినీరు కావడానికి గురువు.. ఇలా సమాజంలో ఏరంగంలో రాణించాలన్నా గురువుల పాత్ర కీలకమని, సర్వస్వం గురువేనని వక్తలు కొనియాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. డీఈఓ ప్రసాద్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ వినోద్ కుమార్ సమాజంలో ఏ వృత్తికీ లేని గౌరవం ఉపాధ్యాయ వృత్తికి ఉందన్నారు. సమాజ మార్గదర్శకులు గురువులేనన్నారు. గురువులు లేని సమాజం ఊహించుకోలేమన్నారు. ఏరంగంలో ఏస్థాయికి వెళ్లినా దాని వెనుక గురువుల కృషి ఉంటుందన్నారు. అలాంటి గురువుల సేవలను సమాజం ఎప్పటికీ మరువవద్దన్నారు. తనకు ఉపాధ్యాయ వృత్తి అంటే చాలా ఇష్టమని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రతి వారం గంటపాటు వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ సమాజంలో గురువులకు విశిష్టస్థానం ఉందన్నారు. గొప్ప సమాజ నిర్మాణంలో టీచర్ల పాత్ర చాలా ఉందన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ నడయాడిన ఆర్ట్స్ కళాశాలలోనే గురువులను సన్మానించుకోవడం అదృష్టమన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో గురువులకు ఎనలేని గౌరవం ఉందన్నారు. డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ అడుగుజాడల్లో నడిచేందుకు ప్రతి గురువూ కృషి చేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలందించిన 77 మంది టీచర్లకు జిల్లాస్థాయి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి, డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



ఉత్తమ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, డీఈవో తదితరులు

రైతు సమస్యలపై పోరుబాటు

- పంటలు నష్టపోయినా ఆదుకోని సర్కారు
- యూరియా పంపిణీలోనూ తాత్సారం
- ఈ నెల 9న అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ర్యాలీ
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. రైతు సమస్యలపై ఈ నెల తొమ్మిదో తేదీన రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతులు, రైతుసంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రైతు సమస్యలపై ఈ నెల 9న ర్యాలీలు నిర్వహించి, ఆర్డీఓలకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు దెబ్బతింటే ఇప్పటి వరకు ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ అందించలేదన్నారు. ఇక ఈ ఖరీఫ్‌లో రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులను అందించకుండా తాత్సారం చేస్తోందని ధ్వజమెత్తారు. జిల్లాలో సాగు విస్తీర్ణం తగ్గినా.. యూరియాను పూర్తిస్థాయిలో ఎందుకు ఇవ్వలేకపోయారని నిలదీశారు.

మంత్రులు, అధికారులపై కేసులు పెట్టాలి

ప్రజాప్రతినిధులు, అధికారుల అండతో డిస్ట్రిబ్యూటర్లు యూరియాను రాష్ట్రం దాటించేశారని అనంత ఆరోపించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామంటూ సీఎం చంద్రబాబు బెదిరించడమేంటన్నారు. యూరియా పక్కదారి పట్టిన ఘటనలో వ్యవసాయ శాఖ మంత్రి, కమిషనర్, జాయింట్ డైరెక్టర్లు, డిస్ట్రిబ్యూటర్లు, తదితరులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలించేశాక ఇప్పుడు విజిలెన్స్ విచారణలంటూ డ్రామాకు తెరలేపారన్నారు. బ్లాక్‌మార్కెట్‌కు తరలించిన సొమ్ము మీకు అందిందా చంద్రబాబూ అని ప్రశ్నించారు.


ప్రజా ఉద్యమం తప్పదు

'మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు, పేద విద్యార్థులకు వైద్యవిద్య అందించేందుకు గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 నూతన కళాశాలలను తేవాలన్న నిర్ణయం విప్లవాత్మకం. అటువంటి గొప్ప నిర్ణయానికి దేశ వ్యాప్తంగా ప్రశంసలు వెలువడితే.. ఇవాళ చంద్రబాబు తన బినామీలకు కట్టబెట్టేందుకు వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం సరికాదు. అలాగే ఆరోగ్యశ్రీని బీమా పరిధిలోకి తీసుకెళ్లాలన్న నిర్ణయం కూడా మంచిది కాదు. వీటిని తక్షణం ఉపసంహరించుకోకపోతే ప్రజా సంఘాలతో కలుపుకుని ప్రజా ఉద్యమం చేపడతామని' అనంత హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలు ప్రారంభించి 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి తెచ్చారన్నారు. కూటమి ప్రభుత్వంలో పది వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో నిర్వహించేందుకు కేబినెట్ తీసుకున్న నిర్ణయం దారుణమన్నారు. కేబినెట్‌లోని మంత్రి నారాయణ, విద్యా సంస్థలు నడుపుతున్న వారికి మెడికల్ కళాశాలలను ధారాదత్తం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వాస్తవంగా 2019 వరకు రాష్ట్రంలో 11 ప్రభుత్వ వైద్య కళాశాలలు మాత్రమే ఉండేవని, అందులో 2,185 సీట్లు ఉండేవని తెలిపారు. జగనన్న సీఎం అయ్యాక మరో 2,550 సీట్లు సమకూర్చేలా 17 వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే బీమా పద్ధతిని తీసుకువస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, రాష్ట్ర నాయకులు గోకుల్‌రెడ్డి, వెన్నం శివరామిరెడ్డి, జానీ, నాయకులు శేఖర్‌బాబు, గుజ్జల శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చింది గోరంత.. నిర్లక్ష్యం కొండంత

ఉచిత మందులకు భారీగా బడ్జెట్ కోతలు

- ఇవ్వడమే తక్కువైతే వినియోగంలో అంతులేని నిర్లక్ష్యం
- సర్వజనాస్పత్రిలో దారుణ పరిస్థితులు
- అత్యవసర మందులు లేక అల్లాడుతున్న సామాన్య రోగులు



అనంతపురం సర్వజనాస్పత్రికి 2024-25లో డ్రగ్స్ వివరాలు

మందులకు వచ్చిన బడ్జెట్	రూ.8,80,99,350
మందులకు వెచ్చించినది	రూ.6,91,98,980
మొత్తం బడ్జెట్‌లో వెచ్చించిన శాతం	79
2025-26 తొలి త్రైమాసికంలో వచ్చిన నిధులు	రూ.2,88,32,909
జూలై 16 నాటికి వెచ్చించిన నిధులు	రూ.1,47,45,749
వచ్చిన నిధుల్లో వెచ్చించిన శాతం	51

అత్యవసర మందుల కొరత

మందు పేరు	ఏ జబ్బుకు
అమాక్సిలిన్ క్లావిలిక్ యాసిడ్	యాంటీ బయోటిక్
ప్రొపాపాల్ ఇంజెక్షన్	ఆపరేషన్ సమయంలో
మెడజోలిన్ ఇంజెక్షన్	సిజేరియన్ కోతలో వేసే మందు
బూపావ్యాకిన్	అనస్థీషియా కోసం
యాంపిసిలిన్	యాంటీబయోటిక్
సిఫెటాగ్జిమ్	యాంటీబయోటిక్
ఆర్టిసునేట్ 60 ఎంజీ, క్లోరోసిన్ ఫాస్పేట్	యాంటీ మలేరియా
మెట్రోనిడజోల్	డయేరియా

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసింది. మందుల బడ్జెట్‌కు భారీగా కోతలు విధించింది. అరకొరగా కేటాయించిన నిధులను వినియోగించడంలో అధికారులు అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి 41 లక్షల మందికి పైగా జనాభాకు పెద్ద దిక్కు అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి. రోజూ వేలాదిమంది ఇక్కడకు వైద్యం కోసం వస్తుంటారు. అలాంటి ఆస్పత్రిలో ఇప్పుడు మందుల కొరత తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. అత్యవసర మందులు లేక నానా తంటాలు పడుతున్నారు. నిత్యం గర్భిణులు, కాలిన గాయాల బాధితులు, ప్రమాదాల్లో గాయపడిన వారు, కుక్కకాటు, పాముకాటు బాధితులు ఇలా రకరకాల పరిస్థితుల్లో ఉన్నవారు ఇక్కడకు వస్తున్నా.. వారికి సరైన మందులు అందుబాటులో లేకపోవడం వేధిస్తోంది.

డైక్లోఫినాక్ ఇంజెక్షన్ల కొరత

ప్రమాదం జరిగి గాయాల పాలైనప్పుడు లేదా హై ఫీవర్‌తో వచ్చినప్పుడు డైక్లోఫినాక్ ఇంజెక్షన్లు ఇస్తారు. తక్షణ నొప్పి నివారిణిగా ఇది ఉపయోగిస్తారు. ప్రతిరోజూ కొన్ని వేల ఇంజక్షన్లు అవసరమవుతాయి. కానీ ఇప్పుడు ఏ ఆస్పత్రిలోనూ లేవు. చిట్టీలు రాసిచ్చి బయట తెచ్చుకోవాలని చెబుతున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో గ్లౌజులు లేవు, మరికొన్ని ఆస్పత్రుల్లో కాటన్ లేదు. ఏరియా ఆస్పత్రుల్లో ఎక్కువగా ప్రసవాలు జరుగుతుంటాయి. డెలివరీ సమయంలో అవసరమైన మందులు లేవు.

యాంటీబయోటిక్స్ మందుల్లేవ్

అనంతపురం సర్వజనాస్పత్రిలో యాంటీబయోటిక్స్ కొరత తీవ్రంగా ఉంది. ప్రాణాధార మందులుగా చెప్పుకునే యాంటీబయోటిక్స్ సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో అందుబాటులో లేవు. సిఫిగ్జిమ్, అమాక్సిలిన్, సెఫటాగ్జిమ్ వంటి ప్రాణాధార మందులు అయిపోయాయి. ఖరీదైన ఈ మందులను బయట తెచ్చుకోవాలని రోగులకు చిట్టీలు రాస్తున్నారు.

క్లుప్తంగా

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అమానుషం

• ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: రాష్ట్రంలోని 10 మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసేలా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకే ఇంతటి అమానుషమైన చర్యలకు ప్రభుత్వ పెద్దలు తెగబడ్డారని విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు వైద్యవిద్యను చేరువ చేసేలా రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటు చేశారన్నారు. విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాలలో కళాశాలలు ప్రారంభించి 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి తెచ్చారన్నారు. గత విద్యా సంవత్సరానికే పులివెందుల, మార్కాపురం, మదనపల్లి, ఆదోని మెడికల్ కళాశాలలు ప్రారంభం కావాల్సి ఉన్నా, ప్రైవేట్‌కు అప్పగించాలన్న దురుద్దేశంతో పులివెందులకు మంజూరైన అనుమతులను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలన్న నిర్ణయాన్ని విరమించుకోకపోతే ప్రజల పక్షాన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 65 మందికి ఉద్యోగాలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలోని సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాల్లోని విద్యార్థులకు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మొత్తం 65 మందికి ఉద్యోగాలు దక్కాయి. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర తెలిపారు. మొత్తం 97 మంది విద్యార్థులు హాజరుకాగా, 65 మందికి ఉద్యోగాలు దక్కాయి. ఉద్యోగాలు దక్కిన విద్యార్థులను ఈఫిల్ టెక్ సొల్యూషన్ డైరెక్టర్ కిషోర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు రాజేష్ కుమార్ గౌడ్, హెచ్ఓడీలు ప్రదీప్ కుమార్, రాజేష్ కుమార్ అభినందించారు.

ఆటోను ఢీకొన్న అంబులెన్స్

• నలుగురికి గాయాలు

శింగనమల: మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై లోలూరు క్రాస్ వద్ద ఆటోను ప్రైవేట్ అంబులెన్స్ ఢీకొంది. శుక్రవారం పామిడి మండలం గంజరాంపల్లికి చెందిన హర్ష, డి.అనిల్, నరేంద్ర, అనిల్ ఆటోలో లోలూరు క్రాస్ వద్ద రసాయనిక మందులు కొనుగోలు చేయడానికి వచ్చారు. క్రాస్ వద్ద ఎడమ వైపు ఉన్న ఫర్టిలైజర్స్ వద్దకు వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతున్న ఆటోను గార్లదిన్నె వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన అంబులెన్స్ ఢీకొంది. ఆటోలో ఉన్న నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అదే అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విత్తన సొమ్ము పక్కదారి!

• ఏపీ సీడ్స్‌కు చెల్లించని ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు
• ఉమ్మడి జిల్లాలో పేరుకుపోయిన రూ.77 లక్షల బకాయిలు
• ఉదాసీనంగా వ్యవవహరిస్తున్న వ్యవసాయాధికారులు



విత్తన వేరుశనగ (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వ ఆధీనంలోని ఏపీ సీడ్స్‌కు చెల్లించాల్సిన విత్తనం సొమ్మును ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు కొందరు సొంతానికి వాడుకున్నారు. పంపిణీ చేసిన రోజు లేదా మరుసటి రోజే ఏపీ సీడ్స్ ఖాతాకు జమ చేయకుండా జాప్యం చేస్తూ వచ్చారు. దీంతో ఏపీ సీడ్స్ ద్వారా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన సొమ్ము కాస్త పక్కదారి పట్టింది.

రూ.77 లక్షలు బాకీ

ఖరీఫ్‌లో ఏపీ సీడ్స్ ద్వారా 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ, విత్తన వరి, 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు (గ్రీన్ మెన్యూర్ సీడ్) రైతులకు పంపిణీ చేశారు. రాయితీ పోనూ రైతులు తమ వాటాగా (నాన్‌సబ్సిడీ) ఆర్ఎస్‌కే అసిస్టెంట్లకు రూ.26,93,71,674 చెల్లించారు. ఇందులో ఇప్పటి వరకూ ఏపీ సీడ్స్‌కు 26.61 కోట్లు చెల్లించినట్లుగా రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. మరో రూ.32.54 లక్షలకు పైగా సొమ్ము ఏమైందో అంతుచిక్కడం లేదు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో రూ.35,55,61,081 విలువ చేసే రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు. అందులో ఏపీ సీడ్స్‌కు రూ.35.11 లక్షలు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.44.21 లక్షలకు లెక్క తేలాల్సి ఉంది. విత్తన పంపిణీ ముగిసి రెండు నెలలు కావస్తున్నా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.77 లక్షల వరకు ఏపీ సీడ్స్‌కు బకాయిలు పేరుకుపోయాయి. ప్రధానంగా అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి ఆర్ఎస్‌కే ద్వారా రూ.8.11 లక్షలు, వెస్ట్‌కోడిపల్లి ఆర్ఎస్‌కే నుంచి రూ.3.69 లక్షలు, ఉరవకొండ మండలం వెలిగొండ ఆర్ఎస్‌కే నుంచి రూ.3.05 లక్షలు, కుందుర్పి మండలం అపిలేపల్లి ఆర్ఎస్‌కే నుంచి రూ.2.04 లక్షలు, గుమ్మఘట్ట మండలం కలుగోడు ఆర్ఎస్‌కే నుంచి రూ.1.82 లక్షలు, కుందుర్పి మండలం బెస్తరపల్లి ఆర్ఎస్‌కే నుంచి రూ.1.24 లక్షలు... ఇలా ఏపీ సీడ్స్ సొమ్మును తమ సొంతానికి ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు వాడుకున్నట్లుగా ఆరోపణలున్నాయి. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలోనూ ఓడీసీ మండలం తంగేడుకుంట, మడకశిర మండలం ఎర్రబొమ్మనహళ్లి, రామగిరి మండలం కుంటిమద్ది, తాడిమర్రి మండలం పెద కోట్ల, గాండ్లపెంట మండలం గొడ్డువెలగల, ఎన్‌పీ కుంట మండలం ఎదురుదొన, నల్లమాడ మండలం దొన్నికోట-2, అమరాపురం మండలం మద్దనకుంట ఆర్ఎస్‌కేల నుంచి రూ.లక్షల బకాయిలు పేరుకుపోయాయి. సొమ్ము చెల్లించకుండా నెలల తరబడి జాప్యం చేస్తున్న ఆర్ఎస్‌కే అసిస్టెంట్లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వ్యవసాయశాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అమ్మవారి సొమ్ము తిరిగొచ్చింది!





ముసలమ్మ తల్లి, అమ్మవారి ఆలయంలో డబ్బులు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

బుక్కరాయసముద్రం: అమ్మవారి సొమ్ము తిరిగొచ్చింది. ఆలయ హుండీలో డబ్బు ఎత్తుకెళ్లిన దుండగులు నెలన్నర తరువాత అదే ఆలయంలో వదిలి వెళ్లారు. అక్కడ ఒక లేఖ కూడా ఉంచారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ముసలమ్మ తల్లి దేవాలయంలో చోటు చేసుకున్న ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే... ముసలమ్మ ఆలయంలోకి ఈ ఏడాది జూలై 22న గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి హుండీని పగలకొట్టారు. అందులోని నగదుతో పాటు ఆలయంలోని సీసీ కెమెరాలను సైతం ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై అప్పట్లోనే ఆలయ నిర్వాహకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా.. శుక్రవారం ఉదయం పూజారి ఆలయం తలుపులు తీసి పూజలు ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా కరెన్సీ నోట్లు కన్పించాయి. వెంటనే ఆలయ ధర్మకర్తకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. ఆలయం వద్దకు చేరుకుని పరిశీలించగా.. డబ్బుతో పాటు లెటరు కూడా కన్పించింది. డబ్బు లెక్కించగా రూ.1.86 లక్షలు ఉంది. ఇక లేఖలో.. 'మేము నలుగురు కలసి అమ్మవారి డబ్బులు ఎత్తుకెళ్లాము. తరువాత మా కుటుంబాల్లో పిల్లలు అనారోగ్యం పాలయ్యారు. అమ్మవారి సొమ్ములో కొంత తీసుకుని మా పిల్లలను బాగు చేయించుకుంటున్నాము. అమ్మా.. మమ్మల్ని క్షమించాల'ని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఆలయ ధర్మకర్త సుశీలమ్మ స్పందిస్తూ.. అమ్మవారు చాలా శక్తివంతమైనవారని, అమ్మవారి సొమ్ము తీసుకుని ఎవరూ జీర్ణించుకోలేరని అన్నారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారమిచ్చారు. నూతనంగా అమర్చిన సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా నిందితులను పట్టుకునే పనిలో పోలీసులు ఉన్నారు.

ఎరువుల సరఫరాలో 'కూటమి' వైఫల్యం

• రైతులను దగా చేసిన చంద్రబాబు
• ఈ నెల 9న గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయండి
• మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: రైతులకు ఎరువులు అందించలేని దౌర్భాగ్య స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మేకల సిద్దార్థ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల కారణంగా యూరియా కొరత నెలకొని రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతుల బలహీనతను ఆసరాగా చేసుకుని కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే బస్తా యూరియా ఇస్తామంటూ నిబంధన పెట్టడం దుర్మార్గమన్నారు. రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలపై చంద్రబాబు విచిత్రంగా స్పందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేస్తున్నారని, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలను అరెస్ట్ చేస్తూ అణిచివేత, నిర్బంధాలకు తెరలేపారని మండిపడ్డారు. రాయలసీమ జిల్లాలకు జీవనాడిగా ఉన్న హంద్రీ-నీవా ద్వారా 6.50లక్షల ఎకరాలకు సాగునీరు ఇప్పటి వరకూ ఎన్ని ఎకరాలకు నీరిచ్చారో చెప్పే దమ్ము ప్రభుత్వానికి, మంత్రి కేశవ్‌కు లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఈ ఏడాదిన్నర కాలంలో హంద్రీ-నీవా ద్వారా జిల్లాకు కనీసం 10 టీఎంసీల నీటిని కూడా తీసుకు రాలేకపోయారన్నారు. నిరంకుశ ధోరణితో లక్షలాది మందికి పైగా రైతులను పంట బీమా పథకానికి దూరం చేశారన్నారు. పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని చెప్పి నేటికీ చాలా మందికి చెల్లించకుండా దగా చేశారని మండిపడ్డారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 9న గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'కమాటి' మాయాజాలం

• గిరిజన బాలికల గురుకులంలో మూడేళ్లుగా విధులకు డుమ్మా
• అయినా ఠంచన్‌గా జీతం అందజేస్తున్న అధికారులు



ఉరవకొండలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవనం

ఉరవకొండ: స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో రెగ్యులర్ కమాటిగా పనిచేస్తున్న రమణమ్మ మూడేళ్లుగా విధులకు డుమ్మా కొడుతున్నా.. అధికారులు మాత్రం ప్రతి నెలా జీతం చెల్లిస్తున్నారు. రూ.45 వేల నుంచి రూ.50 వేల వరకు జీతం తీసుకుంటూ విధులకు గైర్హాజరవుతున్న ఆమె తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై స్పష్టమైన సమాచారం గిరిజన శాఖ ఉన్నతాధికారులకు ఉన్నా.. మామూళ్ల మత్తులో జోగుతూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా, కమాటికి ప్రిన్సిపాల్ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రిన్సిపాల్ అండ చూసుకుని మూడేళ్లుగా బినామీని ఏర్పాటు చేసి 225 మంది విద్యార్థినులకు వంట చేయిస్తున్నట్లుగా సమాచారం. ఇందుకు ప్రతి నెలా రూ.6వేలు కూలి చెల్లిస్తున్నట్లు తెలిసింది. అయితే ప్రిన్సిపాల్ మాత్రం రోజూ కమాటి రమణమ్మ విధులకు హాజరవుతున్నట్లు రికార్డులు సృష్టించి ప్రతి నెలా జీతాలు మంజూరయ్యేలా చేస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. ఈ అంశంలో ప్రిన్సిపాల్‌కూ అంతోఇంతో కమాటి రమణమ్మ ముట్టజెప్పుతున్నట్లు ఆరోపణలున్నాయి.

అనారోగ్యంతో రావడం లేదు

గురుకులంలో రెగ్యులర్ కమాటి మూడేళ్లుగా అనారోగ్యంతో విధులకు హాజరుకావడం లేదు. దీంతో తానే బినామీని ఏర్పాటు చేసి వంట చేయిస్తోంది. కమాటికి హాజరు వేయడం ద్వారా ప్రతి నెలా జీతాలు అందిస్తున్నాం. లేకపోతే విద్యార్థులకు వంట చేసి పెట్టే వారు రారు. దీంతో తప్పని పరిస్థితుల్లో అటెండెన్స్ వేయాల్సి వస్తోంది.

– అరుణ, ప్రిన్సిపాల్, గిరిజన బాలికల గురుకుల పాఠశాల, ఉరవకొండ

నంది విగ్రహం అపహరణ

• అనుమానం రాకుండా మరొకటి ఏర్పాటు



ఎత్తుకెళ్ళిన స్థానంలో ఉంచిన మరో నంది

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ముష్టికోవెల సమీపంలో ఉన్న పురాతన శివాలయంలో నంది విగ్రహాన్ని గురువారం రాత్రి దుండగులు అపహరించారు. శుక్రవారం ఉదయం పూజలు చేసేందుకు వెళ్లిన అర్చకుడు.. అక్కడ నంది విగ్రహం కనిపించకపోవడంతో వెంటనే స్థానికులను అప్రమత్తం చేశాడు. దీంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పరిశీలించారు. శివలింగానికి ఎదురుగా ప్రతిష్ఠించిన నందిని పెకలించి తీసుకెళ్లడంతో పాటు ఎవరికీ అనుమానం రాకుండా ఆలయం ప్రాంగణంలో ఉన్న మరో నంది విగ్రహాన్ని తీసుకెళ్లి అక్కడ ఉంచారు. గతంలోనూ ఈ ఆలయంలో కొందరు క్షుద్రపూజలు చేసి, చోరీకి ప్రయత్నం చేశారని, గుప్తనిధుల కోసమే నంది విగ్రహాన్ని ఎత్తుకెళ్లి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై గ్రామస్తులు మూకుమ్మడిగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విశ్రాంత గురువులను సన్మానించిన వైఎస్సార్‌టీఏ



సన్మానం అందుకున్న విశ్రాంత టీచర్లతో వైఎస్సార్‌టీఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: సుదీర్ఘకాలం ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ తమ బోధనతో ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన గురువులను గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సన్మానం పొందిన వారిలో రిటైర్డ్ హెచ్ఎం ఆర్.సీతారామారావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆర్.కాంతయ్య, ఎ.రామచంద్రయ్య, ఎం.రోగప్ప, జి.రామదాసు, జి.రామ్మోహన్‌రెడ్డి, ఎంసీ సుధాకిరణ్ ఉన్నారు. కార్యక్రమంలో పీడీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూరపాటి నరసింహారెడ్డి, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు గోవిందరెడ్డి, రవీంద్రారెడ్డి, సిద్ధప్రసాద్, వెంకటరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, ఓబిరెడ్డి, విశ్వనాథరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

శివాలయంలో చోరీ



చెల్లాచెదరైన బీరువాలోని సామగ్రి

గుంతకల్లు: స్థానిక సీటీఓ కార్యాలయం సమీపంలోని శివాలయంలో గురువారం రాత్రి దుండగులు చొరబడి బీరువాలోని రూ.40వేలు విలువైన పార్వతీ దేవి పంచలోహ ఉత్సవ విగ్రహంతో పాటు ఆరు తులాల వెండి శివలింగం, దీపాలు, హారతి పళ్లెం అపహరించారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం

రాయదుర్గం టౌన్: స్థానిక బళ్లారి రోడ్డులో మసీదు వద్ద నివాసముంటున్న కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న బాషా కుమారుడు రసూల్ (35) ఆత్మహత్య చేసుకున్నాడు. చిట్టీల కలెక్షన్లతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో కొందరికి అప్పులు ఇప్పించి జామీన్‌గా నిలిచాడు. అప్పు తీసుకున్న వారు సక్రమంగా చెల్లింపులు చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. ఈ క్రమంలో క్షణికావేశానికి లోనైన రసూల్ శుక్రవారం భార్య యాస్మిన్ స్థానికంగానే పుట్టింటికి వెళ్లిన సమయంలో సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్న భార్య విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ప్రజారోగ్యంతో కూల్‌డ్రింక్స్ ఏజెన్సీ నిర్వాహకుల చెలగాటం



కాలం చెల్లిన కూల్ డ్రింక్ బాటిళ్లను పడేస్తున్న దృశ్యం

హిందూపురం: ప్రజారోగ్యంతో కూల్‌డ్రింక్స్ ఏజెన్సీ నిర్వాహకులు చెలగాటమాడారు. కాలం చెల్లిన కూల్‌డ్రింక్ బాటిళ్లను రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా పడేయడంతో అటుగా వెళుతున్న వారు, స్థానికులు, చిన్నారులు గుర్తించి కేసులకు కేసులే ఎత్తుకెళ్లారు. చిన్నారులు కొందరు అక్కడే బాటిళ్ల మూతలు తీసి కూల్ డ్రింక్స్ తాగుతూ కనిపించారు. కాగా, కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విషపూరితంగా మారుతాయని, వాటిని సేవిస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు నిర్లక్ష్యంగా రోడ్డు పక్కన పడేయడం వివాదాస్పదమైంది.

తాగుడుకు డబ్బివ్వలేదని ఆత్మహత్య



సంజీవయ్య (ఫైల్)

రాప్తాడు: తాగుడుకు డబ్బు ఇవ్వలేదంటూ ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం యర్రగుంటకు చెందిన ఉప్పర గౌతమికి రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి కోడిగ సంజీవయ్య (31)తో 14 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. యర్రగుంటలోనే కాపురం ఉంటున్నారు. అదే గ్రామంలో ఐసీఆర్పీ సంస్థలో గౌతమి ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. మద్యానికి బానిసైన సంజీవయ్య ఎలాంటి పనిపాటా చేయకుండా జులాయిగా మారాడు. ఈ క్రమంలో భార్యపై అనుమానం పెంచుకుని మద్యం మత్తులో తరచూ ఆమెను వేధింపులకు గురి చేస్తూ వచ్చేవాడు. తాగేందుకు డబ్బు ఇవ్వాలని కొట్టేవాడు. పలుమార్లు పెద్ద మనుషులు పంచాయితీ పెట్టి నచ్చచెప్పినా అతనిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో ఈ నెల 4న తాగేందుకు డబ్బు ఇవ్వకపోవడంతో మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో గడ్డి మందు తాగి బాత్రూమ్‌లో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక గురువారం రాత్రి సంజీవయ్య మృతి చెందాడు. గౌతమి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు



అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ బి. ఈశ్వరరెడ్డి, డాక్టర్ ఎస్.శారద, డాక్టర్ ఓం ప్రకాష్

అనంతపురం: గురువు అనే పదానికి వన్నె తెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని విద్యారంగంలో విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లకు ఉత్తమ అవార్డులను రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. శుక్రవారం విజయవాడ వేదికగా జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డులను ప్రొఫెసర్ బి. ఈశ్వరరెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.శారద, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఓం ప్రకాష్ అందుకున్నారు.

ముదిరిన 'పచ్చ' పైత్యం



ధ్వంసం చేసిన శిలాఫలకం

తాడిపత్రి టౌన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వాస్పత్రి ఆవరణలో నిర్మించి ప్రారంభించిన 100 పడకల ఆస్పత్రి భవనంలో శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చెరిపేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చిత్రాలు, పేర్లు కనబడకుండా చేశారు. ఇది చూసిన రోగుల సంబంధీకులు 'పచ్చ' పైత్యం బాగా ముదిరిందంటూ వ్యాఖ్యానించారు.

బైపాస్‌కు మోక్షమెన్నడో?



బైపాస్ మార్గంలో ప్రవేశించకుండా అడ్డుగా వేసిన మట్టి

• రూ.194 కోట్లతో ఎన్‌హెచ్-54 నిర్మాణం
• రైల్వే బోస్ట్ రింగ్ గడ్డర్ నిర్మాణ పనుల్లో జాప్యం
• ఎటూ తేల్చక వదిలేసిన అధికారులు
• పట్టణంలోకి భారీ వాహనాలు.. తరచూ ప్రమాదాలు

రాయదుర్గం: ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ అనంతపురం నుంచి మొలకాల్మూరు వరకూ ఎన్‌హెచ్-54 జాతీయ రహదారి నిర్మాణ పనులు రాయదుర్గం వద్ద అర్ధంతరంగా ఆగిపోయాయి. కళ్యాణదుర్గం నుంచి రాయదుర్గం మీదుగా మొలకాల్మూరు వరకు రూ.194 కోట్ల ప్యాకేజీతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనులు పూర్తయ్యాయి. ఈ క్రమంలో రాయదుర్గం పట్టణంలోకి భారీ వాహనాలు ప్రవేశించకుండా 74 ఉడేగోళం వైఎస్సార్ సర్కిల్ నుంచి బీటీపీ ప్రధాన రహదారి దాటుకుని శ్మశాన వాటిక వరకు రోడ్డు ఓవర్ (ఆర్‌ఓబీ) బ్రిడ్జి నిర్మించారు. కోతిగుట్ట సమీపంలో రైల్వే లైనుపై బోస్టరింగ్ గడ్డర్ నిర్మాణానికి రైల్వే అధికారులు అనుమతులు జారీ చేయకపోవడంతో ఈ పనులు కాస్త ఆగిపోయాయి. దీంతో అప్పటి జగన్ సర్కార్ ప్రత్యేక చొరవ తీసుకుని రైల్వే అధికారుల్ని ఒప్పించి నిర్మాణ పనులు ముందుకు తీసుకెళ్లేలా కృషి చేసింది. ఈ లోపు ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా ఈ పనులు పూర్తి చేయలేక వదిలేసింది. దీంతో పట్టణంలోకి వచ్చే భారీ వాహనాల సంఖ్య ఎక్కువైంది. 12, 16, 18 చక్రాల లారీలు ఇరుకైన వినాయక సర్కిల్‌లో తిప్పుకోలేక డ్రైవర్లు నానా ఇబ్బంది పడుతున్నారు. ఆ సమయంలో ట్రాఫిక్ స్తంభిస్తోంది. అంతేకాక భారీ వాహనాల రాకతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బైపాస్ పూర్తయితే భారీ వాహనాలన్నీ అటుగా వెళ్లగలిగితే సగం ట్రాఫిక్ తగ్గుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. చిన్న పని పూర్తి చేసేలా అధికారులు, పాలకులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

హైవే పనులన్నీ పూర్తయ్యాయి. కోతిగుట్ట సమీపంలో రైల్వే లైనుపై బోస్టరింగ్ గడ్డర్ నిర్మాణం మాత్రమే పెండింగ్‌లో ఉంది. దీంతో బైపాస్ రోడ్డు ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఇప్పటికే లక్నో, హుబ్లీ, చెన్నై ప్రాంతాల నుంచి రైల్వే అధికారుల బృందాలు వచ్చి పరిశీలించి వెళ్లాయి. ఇటీవల ఫైనల్ కమిటీ సభ్యులు కూడా చూసి వెళ్లారు. త్వరలో పనులు ప్రారంభించి పెండింగ్ పనులు పూర్తి చేస్తాం.

– కుల్లాయ్‌రెడ్డి, ఎన్‌హెచ్ ఏఈ, అనంతపురం

ఘనంగా మిలాద్ ఉన్ నబీ


నగరంలో ప్రదర్శనకు ఉంచిన ప్రవక్త పవిత్రకేశం


ప్రవక్త పవిత్రకేశం


మిలాద్ ఉన్ నబీ సందర్భంగా నరగంలో నిర్వహించిన ర్యాలీ


శాంతిర్యాలీలో పాల్గొన్న మేయర్ వసీం, మత పెద్దలు


నగరంలో ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు


పాతూరులో ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అనంత, వసీం


శాంతి ర్యాలీలో నినాదాలు చేస్తున్న ముస్లింలు


శాంతి ర్యాలీలో జామపండ్లు పంపిణీ చేస్తున్న ముస్లిం యువత

- నగర వీధుల్లో భారీ ర్యాలీలు

అనంతపురం కల్చరల్: జిల్లా వ్యాప్తంగా మిలాద్ ఉన్ నబీ పర్వదిన వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. నగరంలోని ప్రతి మదరసా, మసీదుల నుంచి పెద్ద ఎత్తున శాంతి ర్యాలీలు నిర్వహించారు. పాతూరు ఆసార్ వీధితో పాటు పలు ప్రధాన మసీదుల వైపు నుంచి జండాలతో, నినాదాలతో సాగిన ర్యాలీలు, సప్తగిరి సర్కిల్ మీదుగా టవర్‌క్లాక్ చేరుకొని ఆర్ట్స్ కళాశాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. జనసంద్రంగా మారిన జులుస్ (శాంతి ర్యాలీ)నుద్దేశించి మత పెద్దలు మిలాద్ ఉన్ నబీ పర్వదిన విశిష్టతను వివరించారు. అంతకు ముందు మసీదుల్లో విశేష ప్రార్థనలు జరిగాయి. మహమ్మద్ ప్రవక్త (స) లోక కల్యాణం కోసం భూమిపై అవతరించి సమూలమైన మార్పులు తెచ్చారని మత పెద్దలు వివరించారు.

వేలాది మందికి జ్యూస్ పంపిణీ

మిలాద్ ఉన్న నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని తరలివచ్చిన వేలాది మంది ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు అనిల్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో జ్యూస్‌లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. స్థానిక నీలిమ సర్కిల్ మీదుగా వచ్చిన వారికి పండ్ల రసం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు పెన్నోబలేసు, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, కార్పొరేటర్ రామాంజనేయులు, పుల్లారెడ్డి, నరేంద్రరెడ్డి, మైనుద్దీన్, మహేష్, ఇమ్రాన్, సాయి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలో శక్రవారం ముస్లింలు మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ వేడుకలను నిర్వహించారు. నూరియా జామియా నూరాని మసీదు నుంచి పెద్ద ఎత్తున ట్రాక్టర్‌లో రకరకాల పూలతో అలంకరించిన చాందిని సయ్యద్ సర్దార్‌వలి దర్గా దగ్గరకు తీసుకెళ్లి అక్కడ చదివింపులు చేశారు. అనంతరం మసీదులో అన్నదానం నిర్వహించారు.

అనంతపురం కల్చరల్: మిలాదున్నబీ పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి పలుచోట్ల మహమ్మద్ ప్రవక్త (స) పవిత్ర కేశ దర్శనం ఏర్పాటు చేశారు. నగరంలోని పాతూరు ఆసార్ వీధి, మాసుమాబీ దర్గాలలో జరిగిన కేశ దర్శనంలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, ఏకేఎస్ ఫయాజ్, రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షుడు కేఎం షకీల్ షఫీ తదితరులు హాజరై ముస్లింలకు పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచానికి మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గం అనుసరణీయమని అన్నారు. రెండోరోడ్డు బహువుద్దీన్ మసీదు, పోలీసు కాంప్లెక్సులోని మసీదుల్లో కూడా ప్రవక్త కేశ దర్శనం ఏర్పాటు చేశారు. ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చి బారులు తీరి భక్తిశ్రద్ధలతో కేశాన్ని దర్శించుకున్నారు. ప్రసాదాలను వితరణ చేశారు.


ఆత్మకూరులో మిలాద్ ఉన్‌నబీ సందర్భంగా శాంతి ర్యాలీ చేస్తున్న ముస్లింలు


పాతూరు మసీదులో మహమ్మద్ ప్రవక్త కేశ సందర్శనకు బారులుదీరిన ముస్లిం మహిళలు


ముస్లింలకు జ్యూస్, పండ్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


శాంతి ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

క్లుప్తంగా

జీజీహెచ్ సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కేఎల్ సుబ్రమణ్యం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం అనస్థీషియా ప్రొఫెసర్‌గా ఉన్న సుబ్రమణ్యంను ప్రభుత్వ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.


ముస్లిం మైనార్టీ కాలనీకి రోడ్డు


కాలనీలో కొత్తగా వేసిన మట్టి రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు: రాప్తాడు పంచాయతీలోని ముస్లీం మైనార్టీ కాలనీ రోడ్డు దుస్థితిపై గత నెల 10వ తేదీన సాక్షి దిన పత్రికలో 'వానోస్తే బురద మయం' శీర్షికతో కథనం వెలువడింది. ఈ వార్తా కథనానికి స్పందించిన ఎంపీడీఓ విజయలక్ష్మి ఆదేశాల మేరకు అధికారులు డ్రైనేజీలు, 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మించారు. నిధులు లేక పోవడంతో ఎర్రమట్టి తోలి మట్టి రోడ్డు వేశారు. రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చి వేశారు. ప్రస్తుతం వర్షం కురిసినా రోడ్డుపై వర్షపు నీరు నిలబడడం లేదు. దీంతో కాలనీ వాసులు వర్షం కురిసినా రోడ్డుపై వర్షపు నీరు ఇంకి పోతుండడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ విజయలక్ష్మిని వివరణ కోరగా సీసీ రోడ్డు నిర్మించేందుకు ప్రతి పాదనలు పంపామని నిధులు వచ్చిన వెంటనే రోడ్డును నిర్మిస్తామని తెలిపారు. ప్రస్తుతం కాలనీ వాసులు ఇబ్బందులను గుర్తించి, మట్టి రోడ్డును నిర్మించామన్నారు.

వృద్ధుడు అదృశ్యం


షేక్ ఆయా సాబ్

అనంతపురం: శెట్టూరు మండలం యాటకల్లు గ్రామానికి చెందిన షేక్ ఆయాసాబ్ (73) కనిపించలేదని కుటుంబ సభ్యులు అనంతపురం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. షేక్ ఆయాసాబ్‌కు ఇద్దరు కుమార్తెలు. భార్య అత్తార్ బీ సుమారు 5 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మానసిక స్థితి సరిగా లేదు. చిన్న కూతురు కొలిమి రహమ్మద్ బీ వద్ద అనంతపురంలో ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించలేదని ఫిర్యాదు చేసినట్లు త్రీటౌన్ సీఐ కే.శాంతిలాల్ తెలిపారు.

కిరాణా షాపులో చోరీ

పుట్లూరు: మండలంలోని కోమటికుంట్ల గ్రామానికి చెందిన డీజిల్ బాబు అనే వ్యక్తికి చెందిన కిరాణా షాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. రాత్రి సమయంలో షాపు తాళాలను పగులగొట్టి రూ.10500 నగదును చోరీ చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. అయితే షాపు వద్ద ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా వైఎస్సార్ జిల్లా నుంచి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేయడానికి కోమటికుంట్లకు వచ్చిన ఓ వ్యక్తి ఈ చోరీకి కారణం అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయులదే


ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్


గురుపూజోత్సవంలో పాల్గొన్న విద్యానికేతన్ యాజమాన్యం, టీచర్లు


జేఎన్‌టీయూఏలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ సుదర్శనరావు


ఎంవీ లక్ష్మయ్యను సత్కరిస్తున్న రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు

అనంతపురం: జీవితంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయులదేనని ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు అన్నారు. శుక్రవారం ఎస్కేయూలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా 2024–25 విద్యా సంవత్సరంలో ఉత్తమ టీచర్ అవార్డు దక్కించుకున్న మాజీ రిజిస్ట్రార్, ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీ లక్ష్మయ్యను సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు మునినారాయణప్ప, ప్రొఫెసర్ నరసింహ, ప్రొఫెసర్ శోభాలత, ప్రొఫెసర్ రవి ప్రసాద్ రావు, ప్రొఫెసర్ భాస్కర్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శంకర్ రెడ్డి, డాక్టర్ కృష్ణుడు పాల్గొన్నారు.

- జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్‌లో ఉన్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య నివాళి అర్పించారు.

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక అశోక్‌నగర్‌లోని శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం గురు పూజోత్సవం నిర్వహించారు. పాఠశాల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన శ్రావణ్‌కుమార్ రెడ్డి, సునీల, వేణులను సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కుసుమ పుల్లారెడ్డి, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, వ్యాయామ టీచరు కేశవరెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని అందించేది ఉపాధ్యాయులే

అనంతపురం కల్చరల్: విద్యార్థుల్లో అంధ విశ్వాసాలు తొలగించి శాస్త్రీయ జ్ఞానాన్ని అందించేది ఉపాధ్యాయులేనని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని స్థానిక జనవిజ్ఞానవేదిక కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథంతో బోధించే గురువులే సమాజాన్ని మార్చగలరని, దేశాభివృద్ధికి తోడ్పాటునందించగలరన్నారు. విలువలతో కూడిన విద్యను బోధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా అధ్యక్షుడు చిత్తప్ప, లక్ష్మీనారాయణ, డాక్టర్ ప్రసూన, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరరాజు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మహమ్మద్ జిలాని, శ్రీనివాసులు, రాధా, గాంగేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

శింగనమల(నార్పల): నార్పల మండల కేంద్రంలోని ఎఫ్ఎస్‌సీఎస్, శ్రీతిరుమలట్రేడర్స్, వెంకటేశ్వర కెమికల్స్ , లక్ష్మీ గణేష్ ఎరువుల దుకాణాలను శింగనమల, నార్పల తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు, యూరియా స్టాక్‌ను పరిశీలించారు. రైతులకు ఎంఆర్‌పీకి మాత్రమే ఎరువులు విక్రయించాలని సూచించారు. నార్పల మండలానికి 40 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శేషారెడ్డి, అరుణకుమారి, ఏఓ చెన్నవీరస్వామి, సీఎస్‌డీటీ చంద్రకళ పాల్గొన్నారు.

బాలిక ఆచూకీ లభ్యం

గుత్తి: కరిడి కొండలో అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యమైంది. వివరాలు.. గత నెల 27న బాలిక అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పీఎస్ఐ గౌతమ్, పీసీలు భాస్కర్ నాయుడు, మహాలక్ష్మి గురువారం రాత్రి బాలిక ఆచూకీ కనుగొన్నారు. విజయవాడ వెళ్లి బాలికను అదుపులోకి తీసుకుని గుత్తికి తీసుకొచ్చారు. శుక్రవారం బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో బాలిక తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీసులను సన్మానించారు.

రేపు నేమకల్లు ఆలయం మూసివేత

బొమ్మనహాళ్: సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేస్తున్నట్లు ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం 1 గంటకు ఆలయ తలుపులు మూసివేస్తామన్నారు. తిరిగి సోమవారం ఉదయం స్వామివారికి యథావిధిగా పూజలు జరుగుతాయన్నారు.

లౌకిక తత్వం పరిరక్షణే ఎర్రజెండా లక్ష్యం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


ఏచూరి వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నేత రాంభూపాల్

అనంతపురం అర్బన్: రాజ్యాంగం, లౌకికతత్వ పరిరక్షణే ఎర్రజెండా లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ అన్నారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలతో ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం అవుతున్నారని విమర్శించారు. శుక్రవారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద ఆ పార్టీ జాతీయ నేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభను సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళుల అర్పించారు. నగర కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాంభూపాల్‌తో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప హాజరై మాట్లాడారు. ఎర్రజెండాను ఆయుధంగా చేసుకుని మతత్వం, కార్పొరేట్, ప్రైవేటీకరణ, దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు సీతారాం ఏచూరి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేటీకరణ విధానాలు అమలు చేస్తూ రాజ్యాంగం, లౌకికతత్వాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో యువత భవిష్యత్ అంధకారంగా తయారైందన్నారు. ఇక ఎన్నికల కమిషన్ భ్రష్టుపట్టిందని తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకునే తిరిగి పాలకులకు లేదని మండిపడ్డారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తున్నా మాట్లాడే పరిస్థితి లేదనారు. జిల్లా పర్యటనకు వస్తున ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడుగుర్రాపల్లిలో దారుణానికి గురైన దళిత బాలికకు న్యాయం చేయాలని రాంభూపాల్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలరంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, ముత్తుజా, వెంకటనారాయణ, వలి, ప్రకాష్, గోపాల్, లక్ష్మీనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన నాటక కళను కాపాడుకుందాం

- రాష్ట్ర స్థాయి నాటక పోటీల ప్రారంభోత్సవంలో డీఆర్వో మలోల


మాట్లాడుతున్న డీఆర్వో మలోల

అనంతపురం కల్చరల్: ప్రాచీన నాటక కళను కాపాడుకుందామని డీఆర్వో మలోల అన్నారు. అనంత వేదికగా ఐదురోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి నాటక పోటీలను ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్వో.. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కృష్ణకళామందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్దాలుగా మనిషికి మానసిక సాంత్వన కలిగిస్తున్న నాటకాలు సినిమా, టీవీ, మొబైల్స్‌రాకతో వెనకపడినా ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో తగిన ఆదరణ ఉందని, దాన్ని పట్టణాలకు కూడా వ్యాపించచేయాలన్న ఉద్దేశంతోనే పోటీలు జరుగుతుండడం అభినందనీయమన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి, కోస్తా ప్రాంతాల నుంచి న్యాయ నిర్ణేతలుగా విచ్చేసిన బాలాజీ నాయుడు, సుబ్రమణ్యం, కర్నూలు టీజీవీ కళాక్షేత్రం పత్తి ఓబులయ్య, రెవెన్యూ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు దివాకర్, సంజీవరెడ్డి, నారాయణస్వామి, ఆదినారాయణరెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతలో నిర్వహిస్తున్న పోటీలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. అనంతరం భగవాన్ శ్రీసత్యసాయి నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో తొలిరోజు కర్నూలు వారి జగదేక సుందరి నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో శ్రీరామరెడ్డి, శ్రీనివాసులు, అస్లాంబాషా, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. తీరని చింత


రాప్తాడు- జేఎన్‌టీయూ రోడ్డు దుస్థితి


అధ్వానంగా ఉన్న పాలచెర్ల నుంచి భోగినేపల్లికి వెళ్లే రోడ్డు

రాప్తాడు: మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వనంగా తయారయ్యాయి. ప్రధానంగా గంగలకుంట, కందుకూరు, జేఎన్‌టీయూ రోడ్డు, మరూరు – ఎం.బండమీదపల్లి, రామినేపల్లి –ఎం.బండమీదపల్లి, బుక్కచెర్ల – గాండ్లపర్తి, ఎం.చెర్లోపల్లి – పాలవాయి, వరిమడుగు – పాలచెర్ల, పాలచెర్ల – భోగినేపల్లి రోడ్డుపై పెద్ద ఎత్తున గుంత ఉండటడంతో ప్రజలు రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది అధికారంలోకి వచ్చిన వెంటనే పాలకులు సంక్రాంతిలోపే రోడ్లును బాగు చేస్తామని ప్రగల్భాలు పలికారు. అయితే ఏడాదిన్నరవుతున్నా రోడ్డుపై కనీసం తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.


పందమేరు రైల్వే బ్రిడ్జి వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు


పాలవాయి రోడ్డులో ఏర్పడిన పెద్ద గుంత


కందుకూరు క్రాస్ మలుపులో ఏర్పడిన పెద్ద గుంత

పోలీస్ స్టేషన్ ఎదుట దళితుల ఆందోళన


విడపనకల్లులో పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్సీ కాలనీవాసులు

విడపనకల్లు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట దళితులు శుక్రవారం ఆందోళన చేశారు. ఇటీవల వినాయక నిమజ్జన వేడుకలో బోయ రమేష్, తరుణ్, రుద్ర, బారిక పవన్‌తోపాటు మరో ఐదుగురు ఉలిగన్న అనే వ్యక్తిపై బీరు బాటిల్‌తో తలపై బాది తీవ్రంగా గాయపరిచారు. ఉలిగన్నపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎస్సీ,ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి , మధు గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్‌ను డిమాండ్ చేశారు. అంతకు ముందు సాకే హరి డీఎస్పీతో వాగ్వాదం చేశారు. ఎస్సీలపై దాడి చేసి తీవ్రంగా కొట్టినా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉలిగన్నపై దాడి చేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, అరెస్టు చేయకపోతే జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఎస్పీకి వినతిపత్రం అందించారు. డీఎస్పీ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉలిగన్న, అతని బంధువులు, భార్య ముత్తమ్మను, గ్రామస్తులను విచారించారు. దాడి చేసిన వారిని కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు.